- కార్పొరేషన్ పాలకవర్గానికి మిగిలింది 50 రోజులు మాత్రమే
- పెండింగ్ పనులపై ఆందోళన
- కార్పొరేటర్లపై నగర ప్రజల ఒత్తిడి

కౌంట్‌డౌన్ షురూ..

కరీంనగర్ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలకవర్గానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జనవరి 29, 2025తో ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగియనున్నది. ఇంకా కేవలం 50 రోజులు మాత్రమే పదవీ కాలం మిగిలి ఉండడంతో కార్పొరేటర్లలో అలజడి మొదలైంది. తిరిగి ప్రభుత్వం కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహిస్తుందో లేక పెండింగ్ పెడుతుందోననే చర్చ సాగుతోంది. 2024 ఫిబ్రవరి 1తో గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసింది. అలాగే జూన్‌లో జడ్పీ పాలకవర్గ పదవీకాలం ముగిసింది. ఈ రెండు పాలకవర్గాలకు ప్రభుత్వం ఎన్నికలకు నిర్వహించక పోవడంతో మున్సిపల్ ఎన్నికలు కూడా నిర్వహిస్తుందో లేదోనని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అయితే సాధారణంగా ఐదేళ్ల పదవీకాలంలో చివరి ఏడాదిలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిపై దృష్టిపెట్టి పాలకవర్గ సభ్యులు మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు సమాయత్తమవుతుంటారు. ఇందుకోసం వారివారి డివిజన్లలో ప్రజలకిచ్చిన హామీల్లో మిగిలిన పనులు పూర్తిచేయించడం, ఓటర్లను ఆకట్టుకునే విధంగా మరికొన్ని కొత్త పనులను చేస్తుంటారు. అయితే గత డిసెంబర్ 9న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలుకావడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడింది.



● ప్రభుత్వం మారడంతో పనులపై ప్రభావం

గత బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధులు వందల కోట్లు విడుదల చేయగా, కాంగ్రెస్ సర్కార్ ఈ యేడాదిలో ఆ నిధులను పూర్తిగా నిలిపివేసింది. దీనితో మున్సిపల్ సాధారణ నిధులు మినహా నగరపాలక సంస్థలో ప్రత్యేక నిధులు లేకుండా పోయాయి. గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరంలో రియల్ వ్యాపారం పూర్తిగా తగ్గడంతో భవన నిర్మాణ అనుమతులతో వచ్చే ఆదాయం తగ్గిపోవడం, ఆస్తిపన్నులు, నల్లాబిల్లులు, ఇతరత్రా పన్నులు కూడా ఆశించిన మేరకు వసూలు కాక పోవడంతో ఖజానాలోని నిధులు నిర్వహణ ఖర్చులకు కూడా సరిపోని పరిస్థితి నెలకొన్నది. దీనితో గత సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరుగగా, అందులో సగానికిపైగా పనులు పూర్తికాలేదు. సీఎం హామీ, పట్టణ ప్రగతి నిధులతో అనేక చోట్ల రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించి రోడ్లను తవ్వగా కాంట్రాక్టర్లు బిల్లులు ఇచ్చే వరకు పనులు చేయమంటూ మొండికేయడంతో ఆ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అయితే గడిచిన మూడున్నర, నాలుగేళ్లలో స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి, సీఎంహామీ, ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులతోపాటు అమృత్ నిధులతో దాదాపు 60 డివిజన్లలో చాలా మేరకు రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, ఓపెన్ జిమ్స్ వంటి అభివృద్ధి పనులు పూర్తిచేశారు.

● కార్పొరేటర్ల ఆందోళన

అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని, రోడ్లు, డ్రైనేజీలు ఇతర అభివృద్ధి పనులు చేయాలని కార్పొరేటర్లకు ప్రజల నుంచి ఒత్తిడి వస్తోంది. చివరి ఏడాదిలో మరింత వేగంగా పనులు చేసి మళ్లీ ఎన్నికలకు ప్రజల్లోకి వెళ్లవచ్చని కార్పొరేటర్లు భావించారు. అయితే చివరి ఏడాదిలో కొత్త పనుల మాట దేవుడెరుగుకానీ, అప్పటికే అసంపూర్తిగా వదిలివేసిన రోడ్లు, ప్రజలకు కొత్తగా చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చక ముందే పాలకవర్గ పదవీకాలం ముగుస్తుండడం చాలా మంది కార్పొరేటర్లను ఆందోళనకు గురిచేస్తుంది. ఇప్పుడే ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని, కుల గణన పూర్తిచేసి రిజర్వేషన్ల సవరణ తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశాలుంటాయని, అవి పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టవచ్చని, సర్పంచు ఎన్నికల్లో అధికార పార్టీకి సానుకూల ఫలితాలు వస్తే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించవచ్చని, లేకుంటే పెండింగ్‌లో పెట్టి అధికారుల పాలనకే మొగ్గుచూపే అవకాశాలు లేకపోలేదని చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే డిసెంబర్ నెలాఖరు, సంక్రాంతిలోపు పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి తమ పాలకవర్గం చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపిస్తే తిరిగి తమను ఆదరిస్తారని మేయర్ సునీల్‌రావుతోపాటు మరికొంత మంది కార్పొరేటర్లు ధీమాతో ఉన్నారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు విడుదల చేస్తే తప్ప పెండింగ్ పనులే పూర్తయ్యే పరిస్థితులు కన్పించడం లేదు. చివరి 50 రోజుల్లో ప్రభుత్వం ఒకవేళ నిధులు ఇచ్చినా ఆ పనులు ఆలోగా పూర్తవుతాయనే నమ్మకం లేదు. ఇక 50 కోట్ల జనరల్ ఫండ్‌తో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు అంతంతమాత్రంగానే పాల్గొనడంతో ఆ పనులు కూడా ఇప్పట్లో ముందుకు కదిలే పరిస్థితి లేదు. మొత్తంగా పదవీకాలం దగ్గరపడుతున్న కొద్దీ కార్పొరేటర్లలో ఆందోళన చోటుచేసుకుంటోంది.

గ్రూప్-2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రూప్-2 పరీక్షకు విధులు కేటాయించిన అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఆలస్యంగా వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. విధులు కేటాయించబడిన అధికారులు ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించా లని అన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరీక్ష నిర్వహించే తేదీల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశిం చారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ విధులు కేటా యించబడిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థుల గుర్తింపు కార్డులను సరిచేసి పరీక్షకు అనుమతించాలన్నారు. సెంటర్‌లో గదుల వివరాలను తెలియజేసే సూచికలను ఏర్పాటు చేయాలని, అన్ని కేంద్రాల్లో వెలుతురు ఉండేలా చూడాలని ఆదేశించారు. విధులు కేటాయించిన సిబ్బంది తమకు కేటాయించిన పని పూర్తవగానే వెంటనే పరీక్ష కేంద్రం నుంచి వెళ్లిపోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజ య్ యాదవ్, మానిటరింగ్ అధికారి పవన్‌కు మార్, గ్రూప్-2 పరీక్ష ప్రాంతీయ కో-ఆర్డినేటర్లు సతీష్ కుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కరీంనగర్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో బుధవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు సర్వే ప్రారంభించారు. మొత్తం 17 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 9,058 దరఖాస్తులు వచ్చాయి. ఆయా గ్రామాల్లో దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి కార్యదర్శులు వివరాల ను సేకరించి ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేస్తున్నారు. గోపాల్‌పూర్‌లో ఈ కార్యక్రమాన్ని ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మితో కలిసి సర్వే తీరు ను తనిఖీ చేశారు. మొదటిరోజు 103 దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఎంపీవో తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచులు కలెక్టర్ కార్యాలయం ఎదుట మూడవ రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మిరాజం(సాగర్), పంజాల జనార్ధన్‌గౌడ్, సాదు, మునీందర్‌రెడ్డి, గంప వెంకన్న, మేచినేని నవీన్‌రావు, ఎండి నజీర్, వేముల దామోదర్, రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు, అలువాల తిరుపతి, అభిషేక్‌రెడ్డి, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్‌గా తిరుపతి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్‌గా నగునూరు గ్రామానికి చెందిన మాగం తిరుపతిని నేషనల్ కమిటీ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్ నియమించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో తిరుపతికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ జిల్లాలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌ను బలోపేతం చేసి హక్కుల సాధన కోసం పోరాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా చైర్మన్ గంప హన్మగౌడ్, వైస్ చైర్మన్ తిరుమలరావు, రాష్ట్ర చైర్మన్ నర్సింగరావు, వైస్ చైర్మన్ కె లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా మహిమాన్విత, మోక్షదా ఏకాదశిగా పిలిచే గీతాజయంతిని బుధవారం ఆలయాల్లో, పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉపవాసం పాటిస్తూ విష్ణు ఆరాధనలు జరిపారు. భగవద్గీత పారాయణాలు, గోపూజలు, గీతా గ్రంథాల వితరణ జరిగాయి. అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతా మందిరంలో విష్ణుసేవానందగిరిస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గీతామందిరం, గీతా భక్త సమాజం ఆధ్వర్యంలో గీతా సంపూర్ణ అధ్యాయాల పారాయణం, హవనం జరిగింది. విద్యార్థులకు భగవద్గీతపై పోటీలు నిర్వహించగా స్వామీజీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పారమిత ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల శ్లోకాలు, నృత్యాలు, నాటికలు, వేషధారణలు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, వివిధ విభాగాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేద భవనంలో సామూహిక గీతాపారాణం జరుగగా వికాసతరంగిణి, జెట్ సంస్థల బాధ్యులు, కార్యకర్తలు, వేద విద్యార్థులు పాల్గొన్నారు. సరస్వతీ శిశుమందిర్‌లో వేషధా రణలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు శ్లోకాలను పఠించారు. ఇంటింటికి భగవద్గీతలో భాగంగా డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్ విద్యార్థులకు గీతా పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో చిదుర సురేశ్, మహేశ్, ఎలగందుల సత్యనారాయణ, బల్మూరి కరుణాకర్‌రావు, కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, కొండా గంగాధర్, సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.



మళయాళ సద్గురు గీతామందిరంలో శ్రీకృష్ణుడికి విశేషాలంకరణ

ఎస్సీ వర్గీకరణ కోసం సంఘటితం కావాలి

భగత్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు మాదిగ విద్యార్థులు సంఘటితంగా ఉద్యమించాలని ఎంఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్ మాదిగ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదిగ విద్యార్థులతో ఎంఎస్ఎఫ్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అణచి వేస్తుందన్నారు. ఈ నెల 19న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభలో మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. ఈ సభను విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగ నరేష్, అలువాల సాగర్, దిలీప్, హరీష్, తదిత రులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించండి

సుభాష్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం హామీ ఇచ్చిన సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఎస్టీ, ఎస్సీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సమస్య లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. సీఎం ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలన్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రావు, కరివేద మహిపాల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, అంజనేయులు, నెల్లిసంపత్‌కుమార్, బెజ్జంకి ఆంజనేయులు, గుండ రాజిరెడ్డి, చంద్రగిరి మహేష్, శ్రీకాంత్, వరలక్ష్మి, నీరజ, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.



- దారితప్పుతున్న యువత
- పోలీసులకు పట్టుబడుతున్నది 25ఏళ్ల లోపు వారే

గంజాయి మత్తు యువత చిత్తు

హుజూరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతుంటే, కొంత మంది యువత చెడుదారిన పడుతున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో కొందరు యువకులు రెండు నెలలుగా గంజాయిని సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కారు. వీరి వద్ద మూడు కిలోల గంజాయి దొరకగా, నలుగురు జైలు పాలయ్యారు. వీరందరూ 25 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. గంజాయి వాడకాన్ని ఓ అలవాటుగా మార్చుకున్న యువత మత్తులో మునిగి తేలుతున్నారు. మత్తుకు అలవాటు పడి కొందరు.. డబ్బు సంపాదన కోసం మరి కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. కొందరు యువకులు మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. సిగరేట్‌లోని తంబాకును దులిపేసి దాని స్థానంలో గంజాయిని నింపుకొని దమ్ము లాగిస్తూ హుక్కా తరహాలో వాడకం అలవాటు చేసుకు న్నారు. నాడు పట్టణాలకే పరిమితమైన గంజాయి నేడు గ్రామాలకు పాకింది. హుజూరాబాద్ డివిజన్‌లోని పట్టణాలతో పాటు పరిసర గ్రామాల్లోని కొంత మంది యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. ఒక వైపు మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని పోలీస్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమాలు నిర్వహించినా గంజాయి మత్తును మాత్రం వదలడం లేదు. ఫలితంగా అనా రోగ్యం పాలవడంతో పాటు కుటుంబాలు కూడా వీధిన పడుతున్నాయి.

● వ్యసనాలకు బానిసగా మారి..

గంజాయి అలవాటు గ్రామాలకు కూడా పాకింది. ఒకరితో ఒకరు స్నేహం చేస్తూ గంజాయి, కొకైన్, డ్రగ్స్ వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన యువకులు మానసిక రోగులుగా విచిత్రంగా వ్యవహరిస్తున్నారు. మత్తులో తేలుతూ జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. చిన్నతనంలోనే అనేక అనారోగ్యాలకు గురవుతూ అటు కుటుంబాలను, ఇటు వ్యక్తిగత జీవితానికి నష్టం చేసుకుంటున్నారు.

● గంజాయి సరఫరా చేస్తూ..

హుజూరాబాద్ డివిజన్‌లో ఇటీవల కాలంలో గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు, వీణవంకకు చెందిన మరో ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడి దానినే వృత్తిగా ఎన్నుకొని సరఫారా చేస్తూ పోలీసులకు చిక్కారు. ఇందులో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులే ఉండడం గమనార్హం.

గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- శ్రీనివాస్‌జీ, ఏసీపీ, హుజూరాబాద్



యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువత జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు వీధిపాలవుతారు. ఇప్పటికే డివిజన్‌లోని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పట్టుబడిన యువతకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం. డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడితే చర్యలు తప్పవు.

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నేతబజార్ లో ఎండు గంజాయిని నిల్వచేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు ఒక ఇంటిలో సోదాలు నిర్వహించి 1.35కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న సయ్యద్ చాంద్, అన్వర్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.రాము తెలిపారు. ఈ సోదాలో సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, జగన్, రాము, శంకర్, సారికలు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు11,(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో సిరిసిల్ల పట్టణం గణేష్‌నగర్‌కు చెందిన గుగులోతు హన్మంతు నాయక్‌కు 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.7వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2, 2017 సిరిసిల్లలో కార్గిల్‌లేక్ పెట్రోల్ బంకు వద్ద పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారని, హన్మం తు మద్యం తాగినట్లు తేలిందని పేర్కొన్నారు. ఈ సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ బొంగోని నాగరాజు విధులకు ఆటంకం కల్గించాడని, హను మంతు నాయక్‌ను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసు పూర్వప రాలు పరిశీలించిన న్యామూర్తి ప్రవీణ్ నేరస్తుడైన గుగులోతు హను మంతు నాయక్‌కు జైలు శిక్షతోపాటు జరిమానా విధించారని తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన కొక్కుల సురేశ్ (32) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన సురేష్ చోళ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు బయట తిరుగుతూ కనిపించాడు. బుధవారం ఉదయం సిరిసిల్ల పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో శవమై కనిపించాడు. సురేశ్ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకరికి విక్రయించిన భూమిని ఫోర్జరీ డాక్యుమెంట్ల సహాయంతో మరో వ్యక్తికి అమ్మి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాంనారాయణ వేములవాడ శివారులోని నందికమాన్ ప్రాంతంలో సిరిసిల్ల అంబేద్కర్ నగర్‌కు చెందిన రమేష్ ఏర్పాటు చేసిన వెంచర్‌లో 200 చదరపు గజాల స్థలాన్ని 2004లో కొనుగోలు చేశాడు. నెలరోజుల క్రితం రాంనారాయణ తన ప్లాట్ వద్దకు వెళ్లి చూడగా అదే స్థలాన్ని ఫోర్జరీ డాక్యుమెంట్‌తో మరో వ్యక్తికి విక్రయించాడని తెలుసుకున్నాడు. దీనిపై రమేష్‌ను నిలదీశాడు. ప్లాట్ కావాలంటే అదనంగా రూ.లక్ష చెల్లించాలనడంతో ఇచ్చాడు. మరో రూ.50 వేలు కావాలని, ఇవ్వకుంటే ఎస్సీ ఎస్టీ కేసు పెడుతానని, కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించడంతో పోలీ సులకు ఫిర్యాదు చేశాడు,

వ్యక్తి మృతికి కారకుడైన నిందితుడికి రెండేళ్ల జైలు

గొల్లపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడిపి ఒకవ్యక్తి మృతికి, మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు కావడానికి కారకుడైన నిందితుడికి సెకండ్ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె. వినీల్ కుమార్ రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 5వేల జరిమానా, బాధిత కుటుంబానికి రూ.50వేల నష్టపరి హారం చెల్లించాలని బుధవారం తీర్పునిచ్చారు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన గట్టు తిరుపతి (36) 2018 నవంబరు 19న తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మంచిర్యాల జిల్లా రెబ్బెనపెల్లి గ్రామానికి చెందిన జీలకర్ర రాజు మరో ఇద్దరిని తన ద్విచక్రవాహనం పై ఎక్కించుకుని అతివేగంగా వచ్చి తిరుపతి ద్విచక్రవాహనాన్ని అబ్బాపూర్ రెవెన్యూ శివారులో ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తిరుపతి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు గొల్లపల్లి అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో బాధితుల పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీ వాదించారు. నిందితుడు రాజు చేసిన నేరం రుజువు కావడంతో సెకండ్ అడిషనల్ జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో తమ వంతు పాత్ర పోషించి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచిన ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ దాసరి ఎల్లయ్య ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు


మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అజాగ్రత్త, అతివేగంతో లారీ నడుపుతూ ఓ విగ్రహ ధ్వంసానికి కారకుడైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి బుధవారం తెలిపారు. కోరుట్ల నుంచి లారీ చెరుకు లోడుతో కామారెడ్డికి వెళ్తుండగా రోడ్డుకు ఆనుకుని ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి తాకడంతో విగ్రహం పాక్షికంగా దెబ్బతిన్నది. స్థానికుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళలకు జైలు శిక్ష

యైటింక్లయిన్‌కాలనీ/జ్యోతినగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు మహిళలకు రామగుండం తహసీల్దార్ జైలు శిక్ష విధించినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. పీకే రామయ్యకాలనీకి చెందిన దేదావత్ మారు, మాలోతు మంజుల ఇద్దరు గతంలో నాటుసారా అమ్మకాల్లో పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్‌సీఐ తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉ్లంఘించి నాటుసారా అమ్మకాలు చేపట్టడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.లక్ష జరిమానా విధించినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. జరిమానా కట్టనందుకు తహసీల్దార్ ఇద్దరు మహిళలకు మూడు నెలల జైలు శిక్ష విధించినట్టు పేర్కొన్నారు.

కాపర్‌వైరు చోరీ

● పట్టుకున్న టాస్క్‌ఫోర్స్


కాపర్ వైరు తరలిస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి): గోదావరిఖని జీడీకే2వ గనిలో దొంగిలించిన కాపర్‌వైర్‌ను హైదరా బాద్‌కు అక్రమంగా రవాణా చేస్తుండగా బుధవారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గోదావరిఖని అడ్డగుంటపల్లి వద్ద ట్రాలీని పట్టుకున్నారు. 65కిలోల కాపర్‌వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్క్రాప్ షాప్ నిర్వాహకుడు దొంతుల శ్రీనివాస్, డ్రైవర్ ముత్యాల ఐలయ్యను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

టీఎస్‌టీపీపీ స్టేజ్-2 నిర్మాణానికి అంతా సిద్ధం

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ)



- 800 మెగావాట్లకే రాష్ట్ర ప్రభుత్వం పీపీఏ?
- వెయ్యి మెగావాట్లు కోరుతున్న ఆంధ్రప్రదేశ్
- బీహెచ్‌ఈఎల్ సంస్థకు నిర్మాణ కాంట్రాక్టు

జ్యోతినగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) నిర్మాణానికి అంతా సిద్ధమైంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో 4,000 మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించేందుకు నిర్ణయించారు. ఫేజ్-1లో 1,600 మెగావాట్ల(800 మెగావాట్ల రెండు యూనిట్లు) ప్లాంటును నిర్మించారు. 2016లో టీఎస్‌టీపీపీ లో నిర్మాణ పనులు ప్రారంభం కాగా, అనేక కార ణాల వల్ల ప్రాజెక్టు పూర్తి చేయడంలో జాప్యం జరి గింది. ఈ ఏడాదిలో స్టేజ్-1లోని రెండు యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో మిగతా 2,400 మెగావాట్ల(800 మెగావాట్ల మూడు యూనిట్లు) స్టేజ్-2ను నిర్మించేందుకు వేగంగా అడుగులు పడ్డాయి. టీఎస్‌టీపీపీ రెండో దశకు సంబంధించి గతంలోనే ఎన్టీపీసీ బోర్డు డైరెక్టర్ల అనుమతి లభించగా, తాజాగా పెట్టుబడి వ్యయం(బడ్జెట్) కూ డా ఎన్టీపీసీ బోర్డు ఆమోదం తెలిపింది. గత నెలలో జరిగిన బోర్డు డైరెక్టర్ల సమావేశంలో తెలంగాణ టీఎస్‌టీపీపీకి 29,345.85 కోట్ల భారీ పెట్టుబడి వ్యయాన్ని ఖరారు చేశారు. మరోవైపు స్టేజ్ నిర్మాణా నికి సంబంధించి ఎన్టీపీసీ యాజమాన్యం చేయాల్సిన సాంకేతిక, పాలనా పనులు చకచకా పూర్తి చేస్తున్నది. ప్రస్తుతం స్టేజ్-1 ప్లాంటుకు ఆనుకుని ఉన్న స్థలం లోనే(మొత్తం 650 ఎకరాలు, స్టేజ్1,2) స్టేజ్-2 నిర్మించేందుకు కార్పొరేట్ ఇంజనీరింగ్ విభాగం డిజైన్లను రూపొందించింది. స్టేజ్-2కు ఎలాంటి భూసే కరణ లేనప్పటికీ యాష్‌పాండ్ కోసం అంతర్గాం మండలం కుందనపల్లి శివారులో భూసేకరణ చేస్తోంది.

● 800 మెగావాట్లకే తెలంగాణతో పీపీఏ?

టీఎస్‌టీపీపీ స్టేజ్-2లో 2,400 మెగావాట్లలో 800 మెగావాట్లు(ఒకే యూనిట్)కు మాత్రమే విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకు నేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. 2,400 మెగావాట్లలో 800తెలంగాణ పీపీఏ చేసుకోవాలనుకుంటుండగా, 1000 మెగావాట్లు కావాలని ఆంధ్రప్రదేశ్ ఎన్టీపీసీని కోరుతు న్నది. మిగతా 600 మెగావాట్లను కేంద్రానికి కేటాయించే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 85శాతం విద్యుత్ తెలంగాణకే కేటాయించాల్సి ఉంటుంది. స్టేజ్-1లో 1600 మెగావాట్లలో 85శాతం తెలంగాణ రాష్ట్రానికే సరఫరా అవుతున్నది. అయితే కేవలం 800 మెగావాట్లకే పీపీఏ చేసు కునే విషయంలో ఏసమస్యా రాకుండా ఉండేం దుకు ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని ఎన్టీపీసీ నియమిం చింది. పవర్‌పర్చేజ్ అగ్రిమెంటు విషయంలో ఈ నిపుణుల కమిటీ కసరత్తు చేస్తున్నది. త్వర లోనే పీపీఏ జరిగే అవకాశ ముంది. కాగా, ఈ సాంకేతిక అంశాల చర్చ జరుగుతున్న క్రమంలోనే మరోవైపు నిర్మాణపనులను ప్రారం భించేందుకు ఎన్టీపీసీ అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నది.

● 19న ప్రజాభిప్రాయ సేకరణ..

స్టేజ్-2కు సంబంధించి ఈనెల 19న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. గత నెల 29న పబ్లిక్ హియరింగ్ జరగాల్సి ఉండగా, సీఎం పర్య టన కారణంగా వాయిదా పడింది. ఈక్రమంలో 19న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా పర్యావరణ, ఉపాధి, అభివృద్ధి తదితర అంశాలపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను తీసు కుంటారు.

● బీహెచ్‌ఈఎల్‌కు కాంట్రాక్టు..

టీఎస్‌టీపీపీ రెండో దశకు సంబంధించి నిర్మాణ కాంట్రాక్టు మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్) సంస్థకు దక్కింది. స్టేజ్-2 నిర్మాణంకోసం మూడు నెలల క్రితం గ్లోబల్ టెండర్లను ఎన్టీపీసీ ఆహ్వానించింది. ఎల్‌అండ్ టీ సంస్థ తక్కువ ధర కోడ్ చేయడంతో ఆ కంపెనీకే టెండరు ఖరారు కావాల్సి ఉంది. అయితే టీఎస్‌టీపీపీ తో పాటు మరో రెండు ఇదే కెపాసిటీ గల ఎన్టీపీసీ ప్రాజెక్టుల టెండర్లకు సంబంధించి ఎల్‌అండ్ టీ తక్కువ ధర కోడ్ చేసి కాంట్రాక్టు దక్కించుకుంది. మూడు భారీ ప్రాజెక్టులను ఏకకాలంలో నిర్మించే విష యంలో ఇబ్బందులు ఎదురవుతాయనే విషయంలో బీహెచ్ ఈఎల్, ఎల్‌అండ్‌టీ మధ్య చర్చలు జరిగాయి. చివరికి తెలంగాణ ఎన్టీపీసీ నిర్మాణ కాంట్రాక్టును బీహెచ్‌ఈ ఎల్‌కు ఇచ్చేందుకు ఎల్‌అండ్‌టీ ఒప్పుకుంది. మొత్తం 29,345 కోట్ల(పెట్టుబడి వ్యయం) విలువైన మొత్తం నిర్మాణ పనులను బీహెచ్‌ఈఎల్ చేపట్ట నుంది. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలో మత ప్రచారం

● ఉపాధ్యాయుడిపై వేటు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మత ప్రచారానికి ప్రయత్నించిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగాల రాజును సస్పెండ్ చేస్తూ డీఈవో జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. మండలంలోని నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఓ మతానికి సంబంధించిన సామగ్రిని ఉపాధ్యాయుడు రాజు పంపిణీ చేశారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు అడ్డు కోవడంతో ఎంఈవో కృష్ణహరి పాఠశాలలో విచారణ జరిపి సమర్పించిన నివేదిక మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్, ఆమె భర్తపై కేసు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కోర్టు అనుమతి మేరకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ నీరటి భవానితో పాటు ఆమె భర్త భూమరాజంపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. గ్రామంలోని బెస్త నరేశ్ కొడుకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. పిల్లలకు కోడిగుడ్లు అందించకపోవడంతో గతనెల 4న ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అదే నెల 5న నరేశ్ భార్య శిరీష తన కుమారుడిని తీసుకుని కేంద్రానికి వెళ్లగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంపై అంగన్‌వాడీ టీచర్ భవాని హెచ్చరించింది. దీంతో ఆమె తన భర్త నరేశ్‌కు జరిగిన విషయం చెప్పింది. మళ్లీ అధికారులకు ఫిర్యాదు చేయ డంతో చర్యలు తీసుకున్నారు. ఆగ్రహించిన అంగన్‌వాడీ టీచరుతోపాటు ఆమె భర్త అదే రోజు నరేశ్‌కు ఫోనుచేసి బెదిరించారు. గత నెల 6న బాధితుడి ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో అంగన్‌వాడీ టీచరు భవాని, ఆమె భర్త భూమరాజంపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక

మల్యాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన శ్రీహర్ష రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక అయింది. రామానుజన్ జయంతి పురస్కరించుకొని జగిత్యాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో బుధవారం పదవతరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ఇందులో శ్రీహర్ష జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపిక కాగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


శ్రీహర్షను అభినందిస్తున్న నిర్వాహకులు, అధ్యాపకులు

క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన పూడూర్ వాసి

కొడిమ్యాల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన మరక వెంకటసంజయ్ అండర్ 14 తెలంగాణ క్రికెట్ జట్టులో నెంబర్ 3 బ్యాట్స్‌మెన్‌గా ఆడి ప్రతిభ కనబరిచాడు. వెంకటసంజయ్ ఈ నెల 7 నుంచి 9 వరకు గోవాలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ లో పాల్గొని జాతీయ స్థాయి టీంకు ఎంపిక య్యాడు. 2025 జనవరి చివరి వారంలో శ్రీలంకలో జరుగనున్న అంతర్జాతీయ స్థాయిలో 20-20, వన్‌డే, అండ్ టెస్ట్ మ్యాచ్‌లలో బీసీసీఐ భారత జట్టు తరుపున ఆడనున్నాడు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొననున్న వెంకటసంజయ్‌కు పూడూర్ గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


విన్నర్ కప్ అందుకుంటున్న వెంకటసంజయ్

తక్కువ ధరకు సిమెంట్ ఇస్తామంటూ మోసం..

- ఫేక్ కంపెనీ పేరిట ఆన్‌లైన్‌లో పోస్టు
- ఐదు లక్షలు చెల్లించిన కాంట్రాక్టర్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సుల్తానాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు సిమెంట్ సరఫరా చేస్తామంటూ ఓ ఫేక్ కంపెనీ పేరుతో మోసగాళ్లు ఆన్‌లైన్‌లో ప్రకటన పెట్టారు. అది చూసిన కాంట్రాక్టర్లు నాలుగు లక్షల 45వేలు చెల్లించారు. ఎంతకూ సిమెంట్ రాకపోవడంతో మోసపోయామని తెలిసి బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

వివరాలు ఇలా ఉన్నాయి. తక్కువ ధరకు సిమెంట్ సప్లై చేస్తామని, కావల్సిన వారు తమను సంప్రదించాలంటూ ప్రియ సిమెంట్ వర్క్స్, పెద్ద పల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి అడ్రస్ పేరిట ఆన్‌లైన్‌లో ప్రకటన కనిపించింది. అది చూసిన వరంగల్ జిల్లా నర్సంపేటకు చెంది న ఇద్దరు కాంట్రాక్టర్లు ప్రకటనలోని సెల్‌ఫోన్ నంబరులో సంప్రదించారు. పలు దఫాల్లో నాలుగు లక్షల 45వేల రూపాయలు బ్యాంకు ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఎంతకు సిమెంట్ రాకపోవడంతో బుధవారం సుల్తానాబాద్‌కు చేరుకొని ఆరా తీశారు. వారు పంపించిన కొటేషన్‌లో ఉన్న అడ్ర స్‌లో అసలు ఎలాంటి కంపెనీ లేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల సూచన మేరకు ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు

జగిత్యాలరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ పాఠశాలను ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రేవ తిరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు తాజాకూరగాయలతో నాణ్యమైన భోజనంతో కూడిన వంటకాలు చేయాలని సూచించారు. లక్ష్మీపూర్ మహాత్మా జ్యోతిబా పూలే విద్యార్థులు కాస్మొటిక్స్ కోసం రోడ్డెక్కి ధర్నా చేసిన విషయం తన దృష్టికి రావడంతో పాఠశాలను తనిఖీ చేశానని తెలిపారు. విద్యా ర్థుల తల్లితండ్రులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించవద్దని పాఠ శాల ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్త బియ్యం తినడం వల్ల కొంత ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు రేవతిరావుకి విన్నవిం చారు. వంట మనుషులతో వారానికొకసారి ప్రిన్సిపల్ సమావేశం నిర్వహించాలని, ఏవైన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి నరేష్, సీడీపీవో మమత, సూపర్‌వైజర్ పవిత్ర, పాల్గొన్నారు.


లక్ష్మీపూర్ మహాత్మజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తున్న రేవతిరావు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్స వంలో భాగంగా బుధవారం ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రసంగిస్తూ విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితశాస్త్రం ఎనలేని పాత్ర వహిస్తుందన్నారు. గణితశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీనివాస రామా నుజన్‌ను ఆదర్శంగా తీసుకొని యువత గణిత శాస్త్ర మేధా వులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పి.నితిన్, సాంఖ్యశాస్త్ర విభాగ అధిపతి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యా ర్థులకు మున్సిపల్ కమిషనర్ బహుమతులను అందజేశారు అనంతరం విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై ఒక నాటికను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

పిల్లల నడవడికపై శ్రద్ధ వహించాలి

- విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను అలవర్చుకోవాలి
- ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి
- ఎన్టీపీసీలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం


విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

జ్యోతినగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే శాస్త్రీయ ఆలోచనలను అలవర్చుకొని ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించు కోవాలన్నారు. బుధవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న 3రోజుల జిలా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రసంగిస్తూ ఆధునిక సాంకే తిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తమ వ్యక్తిగత అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఇదే సమయం లో తల్లిదండ్రులు సైతం పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని సన్మార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత అని అన్నారు. జిల్లా విద్యాధికారి డి.మాధవి మాట్లాడుతూ ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. అలాగే ప్రదర్శనలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, స్నేహితులతో సఖ్యతగా ఉండడం నేర్చుకుంటారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు ప్రసంగిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయసాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో జిల్లా విద్యార్థులు సాధించిన అవార్డుల వివరాలను వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలిపాక సుజాత, రామగుండం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. మోహన్, ఎంఈవోలు టి.విమల, కె.ఏకాంబరం, స్వర్ణలత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం సందర్భంగా విద్యార్థులుచేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది.

ఒలింపిక్ సంఘంలో ఉమ్మడి జిల్లావాసులకు చోటు



జనార్దన్‌రెడ్డి, మహేందర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలింపిక్ సంఘంలో ఉమ్మడి జిల్లావాసులకు చోటు దక్కింది. ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి సంయుక్త కార్యదర్శిగా రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా పెద్దపల్లి జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుధవారం ఎన్నికల అధికారి ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో ఒలింపిక్ సంఘం కార్యవర్గ ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ఎన్నికల అధికారి, రిటైర్డ్ హైకోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన జనార్దన్‌రెడ్డి 40 సంవత్సరాలుగా క్రీడా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన సిలివేరి మహేందర్ సీనియర్ ఖో-ఖో క్రీడాకారుడిగా పదికిపైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలను సాధించారు. వీరిని ఉమ్మడి జిల్లాకు చెందిన ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు నందెల్లి మహి పాల్, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వివిధ జిల్లాల డీవైఎస్‌వోలు, క్రీడా సంఘాల రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు అభినందించారు.

అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికత పెంపొందుతుంది

- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి



గో పూజ చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

కోరుట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికత పెంపొందుతుందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని అయ్యప్ప జ్ఞాన సరస్వతి ఆలయంలో పట్టణానికి చెందిన జుంబర్తి రమేష్ గురుస్వామి 18వసారి దీక్ష స్వీకరించగా వేదపండింతుడు పాలెపు రామకృష్ణ శర్మ మత్రోచ్చారణల మధ్య అయ్యప్ప పడి పూజ మహోత్సవం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం నిర్వహించి అష్టోత్తర కార్యక్రమాలను జరిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హంపీ పీఠాధిపతి దేవాలయంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జుంబర్తి రమేష్ స్వామికి విద్యారణ్య భారతి స్వామి దర్మదండంను అందించి ఆశీర్వదించారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యా అనిల్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జుంబర్తి రమేష్ అయ్యప్ప స్వాములతో పాటు భక్తులకు అన్న ప్రసాదం అందించంగా అధిక సంఖ్యలో భక్తులు, స్వాములు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. మార్గశిర మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో మల్లన్న భక్తులకు తోడుగా సాధారణ భక్తులు స్నానాలు ఆచరించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నరసింహమూర్తి, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతిధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలను సీఎం సందర్శించాలి

సారంగాపూర్, డిసెంబరు, 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రతీరోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆసుపత్రుల్లో చేరడంతో సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయందోళన నెలకొందన్నారు. కనీసం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ఒక్కసారి కూడ సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమస్యలను తెలుసుకోలేదన్నారు. వెంటనే ముఖ్యమంత్రి సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమీక్ష జరిపి ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

సూరమ్మ చెరువు ఎడమ కాలువకు భూములు ఇవ్వం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఇప్పపల్లి రైతులు

కథలాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలికోట సూరమ్మ చెరువుకు నిర్మించనున్న ఎడమ కాలువకు భూములు ఇవ్వమని మండలంలోని ఇప్పపల్లి రైతులు స్పష్టం చేశారు. బుధవారం గ్రామంలో భూసేకరణ నిమిత్తం తహసీల్దార్ వినోద్ రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఇప్పపల్లిలో 39 ఎకరాల భూమి కాలువ నిర్మాణానికి అవసరమని అధికారులు గుర్తించగా రైతుల అంగీకారం కోసం సమావేశం ఏర్పాటు చేశారు. అయితే తాము చిన్న, సన్నకారు రైతులమని ఉన్న భూములు కోల్పోతే బతుకులు ఆగమవుతాయని అధికారులకు వివరించారు. భూములు కాలువ కోసం ఇవ్వబోమని పేర్కొంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఊరికి అండగా వలస జీవులు



● గల్ఫ్‌లో ఉంటూ గ్రామాల్లో అభివృద్ధి పనులు ● ఉన్న ఊరిపై మమకారంతో సేవా కార్యక్రమాలు



గంభీర్‌పూర్‌లో గల్ఫ్ సంఘం వారు నిర్మించిన బస్టాండ్

కథలాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేత పట్టుకుని గల్ఫ్ వెళ్లిన వలసజీవులు కన్న ఊరిపై మమకారాన్ని మరచిపోవడం లేదు. వచ్చిన జీతంలో కొంత పొదుపు చేసుకోవాలనే భావనతో పొదుపు సంఘం ఏర్పాటు చేసుకుని ప్రతి నెలా డబ్బు జమ చేసుకుంటున్నారు. పోగేసుకున్న డబ్బులను కొందరు అత్యవసర పనులకు వాడుకుని మళ్లీ నిర్ణీత నెలలకు వడ్డీతో సహా సంఘంలో జమచేస్తారు. ఇలా గత పదేళ్లగా డబ్బులు భారీగా జమకావడంతో తమ సొంతూళ్ల అభివృద్ధికి వెచ్చించాలనే ఆలోచనలకు శ్రీకారం చుట్టారు.

● ఆధ్యాత్మికతకు ప్రథమ ప్రాధాన్యం

అడవుల్లో విసిరేసినట్టు ఉన్న తుర్తి, పోతారం, అంబారిపేట వంటి మారుమూల గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఉపాధి అవకాశాలు లేక కేవలం వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉండడంతో యువత దుబాయి, సౌదీ అరేబియా, కువైట్, బెహరాన్, మస్కట్ వంటి గల్ఫ్ దేశాల బాట పట్టారు. అక్కడ ఆర్థికంగా నిలుదొక్కుకుంటున్న క్రమంలో సొంతూరుకు కొంత మేలు చేయాలని అనుకున్నారు. మొదటగా ఆధ్యాత్మికతను పెంచుకోవాలనే తలంపుతో ఆలయాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అంబారిపేటకు చెందిన 55మంది గల్ఫ్ వలస కార్మికులు దాదాపు రు. 70లక్షలతో రామ మందిరం నిర్మించారు. సౌదీలో ఉన్న సంఘ సభ్యులు రు.12 లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మించారు. రు.70 వేలతో బాడీ ఫ్రీజర్ గ్రామానికి అందజేశారు. ఆలయంలో నిత్యం పూజలు నిర్వహించడానికి పూజారికి నెల నెలా వేతనం చెల్లిస్తున్నారు. ఏటా శ్రీరామ నవమిన భక్తులకు అన్నదానం చేస్తున్నారు. తుర్తిలో పదేళ్ల కిందటే రు. 5 లక్షలతో హన్మాన్ ఆలయం, సుమారు రు. 2.50 లక్షలతో దుర్గమ్మ దేవాలయం, లక్ష రూపాయలతో బోరు, పాఠశాలలో విద్యార్థుల కోసం షెడ్ ఏర్పాటు చేశారు.

● పోతారం కార్మికులు వంద మందితో...

పది సంవత్సరాల కిందట పది మందితో ఏర్పడ్డ పోతారం గల్ఫ్ వలస కార్మికులు ప్రస్తుతం వంద మందితో సంఘం ఏర్పడింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లొంకరామేశ్వరస్వామి వద్ద రు. 10 లక్షలతో భక్తులు సేదదీరడానికి కల్యాణ మంటపం నిర్మించారు. కలికోటకు వెళ్లేదారిలో ఉన్న మర్రవ్వ ఆలయం వద్ద భక్తుల కోసం రు. 2 లక్షలతో షెడ్, పాఠశాలలో విద్యావలంటీర్ల కోసం నెలకు రూ 15వేలు వెచ్చిస్తున్నారు. అదేవిధంగా రూ. 40వేలతో పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్లు, స్కూల్ ఆకర్షణీయంగా కనిపించేందుకు రు. 70వేలతో పెయింటింగ్ వేయించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు దోహదం చేస్తున్నారు. ఆపద సమయంలో పేదలకు పలు సందర్భాల్లో ఆర్థికంగా చేయూత అందిం చారు. సప్త సముద్రాల అవతల ఉన్నా తమ కన్న ఊరిని మరిచి మరిచిపోకుండా అభివృద్ధి కోసం మరింత పాటు పడతామని గల్ఫ్ కార్మికులు పేర్కొంటున్నారు.



భక్తుల కోసం నిర్మించిన కల్యాణ మండపం



అంబారిపేటలో నిర్మించిన రామమందిరం

'పిల్లలకు కాలం చెల్లిన మందులు ఇస్తారా?'



మందులను పరిశీలిస్తున్న దావ వసంత

జగిత్యాల అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో కనీస వసతులు లేక అస్వస్థతకు గురై చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన పిల్లలకు కాలం చెల్లిన మందులిస్తారా అంటూ జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆగ్రహం వ్యక్తం చేశారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురికాగా విషయం తెలుసుకున్న వారు మాతా శిశు కేంద్రంలో విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మందులను చూసి విస్మయం చెందారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఆమె వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక, కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సాగి సత్యం, చింత గంగాధర్, రిజ్వాన్, ప్రణయ్ ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించ నున్నారు. కొత్తపల్లి సమీపంలోని అకాడ మిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2010 తర్వాత జన్మించినవారు అర్హులని తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జనవరిలో నిర్వహించే ఆల్‌ఇండియా అంతర జిల్లాల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, స్టడీ సర్టిఫికెట్లతో సంఘ సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, పాఠశాల పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలు



రాజన్న ఆలయంలో భగవద్గీత పఠనం చేస్తున్న విద్యార్థులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీగీతా జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రాజన్న ఆలయంలో బుధవారం తెల్లవారు జామున ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం స్వస్తి పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కాగా ఆలయ నాగిరెడ్డి మండపంలో గీతాహోమం కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల విద్యార్థులు పాల్గొని భగవద్గీత పఠనాన్ని చేశారు. శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గర్శకుర్తి వెంకటేశ్వర్లు, మోటూరి మధు, రమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



అయ్యప్ప స్వామికి చక్రస్నానం చేయిస్తున్న గురుస్వామి, సిరిసిల్లలో అయ్యప్పస్వామి శోభాయాత్ర

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప దీక్షాపరుల నృత్యాలు, శరణు ఘోషతో పరిసరాలు మార్మోగాయి. అనంతరం మానేరు నదిలో గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అర్చనలు, అభిషేకాలతోపాటు చక్రస్నానం చేశారు. అనంతరం సాయినగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ఎరుకల ప్రకాష్, బల్కి రమేష్ పంతులు, మధుసూదన్, కౌన్సిలర్లు కల్లూరి రాజు, వెల్దండి దేవదాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న విరాహత్ అలీ

తిమ్మాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీ లోగల తాపాల నృసింహస్వామి ఆలయ కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్రవర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విరాహత్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్యాగాలు, ఉద్యమాల మీద యూనియన్ ఏర్పడిందని, వ్యక్తుల వల్ల కాదన్నారు. యూనియన్‌లో చెమడొడ్చి పనులు చేసే నాయకులు, యూనియన్ నిబంధనలకు అనుగుణంగా పనిచేసే నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు ఆసుపత్రుల్లో బిల్లులు చెల్లించకపోవడంతో జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ నిలిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య అందజేస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, ఈ విషయంపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో కలిసి చర్చించామన్నారు. త్వరలో ప్రభుత్వం జర్నలిస్టులకు హెల్త్ స్కీం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీనితో పాటు అక్రిడిటేషన్లకు సంబంధించి విధివిధానాలు త్వరలోనే వెలువడతాయన్నారు. ఇళ్ల స్థలాలు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు విరహత్ అలీ తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై మొదటిసారి జిల్లాకు వచ్చిన విరాహత్ అలీ, కె రాంనారాయణను జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, పరిశీలకులు కె రాజారెడ్డి, జిల్లా నాయకులు గాండ్ల శ్రీనివాస్, ఈద మధుకర్‌రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కామర్స్ జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యో తి): కరీంనగర్‌లోని రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో జనవరి 7,8 తేదీ ల్లో ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ ఇన్ కామ ర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు నిర్వహణ కార్యదర్శి మల్లారెడ్డి తెలిపారు. ఎస్ఆర్ ఆర్ కళాశాల అధ్యాపక బృందంతో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్ డిగ్రీ కళాశాల లను బుధవారం సందర్శించి అవగాహన సదస్సు కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఆయా కళాశాలల బాధ్యులు డాక్టర్ అశోక్, ఆచార్యరామకృష్ణ, శ్రీపాద నరేష్, యాద రామకృష్ణ, రాజేందర్, కార్యక్రమ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లికార్జున స్వామి ఆలయం

బోనాలు సమర్పించిన భక్తులు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి బుధవారం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, స్వామివారికి ప్రీతిపాత్రమైన బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో గర్భగుడిలోకి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకుని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు నిలువెత్తు నల్ల బంగారం (బెల్లం) తులాభారం వేసి భక్తులకు పంచిపెట్టారు.

ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్నపట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల మల్లన్న నామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించా యి. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్‌శర్మ, కొండూరి రఘునందన్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యే క పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు ఉచిత సేవలను అందించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తదితరులు పర్యవేక్షించారు.

యూనిసెఫ్ దినోత్సవం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం యూనిసెఫ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ విద్యార్థులకు బొమ్మలు, బిస్కెట్లు, బెలూన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎంపీడీవో సంజీవరావు, ఎస్‌బీఎం కో-ఆర్డినేటర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ స్వరూపారాణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

గణేశ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ సైన్స్ ఆర్ట్స్ కళాశాల జంతు శాస్త్రం, ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలో జగిత్యాలలోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రాన్ని ఎంటమాలోజీ, వర్మీ కంపోస్ట్ విభాగాన్ని విద్యార్థులు సందర్శించారు. వర్మి కంపోస్టు తయారు చేసే విధానాన్ని, వర్మి కంపోస్టులో వినియోగించే వానపాముల గూర్చి విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ, జంతు శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జ్యోతిలక్ష్మి, జంతుశాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ కె కిరణ్ మై డాక్టర్ రవీందర్ రావు, డాక్టర్ సురేందర్ రెడ్డి, డాక్టర్ కల్పన, సమత పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న గీత కార్మిక మహిళా సంఘం అధ్యక్షురాలిగా తాళ్లపల్లి సంధ్యగౌడ్ నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గీత కార్మిక విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పరశురాం గౌడ్ హాజరై మాట్లాడుతూ గత 12 సంవత్సరాల సంఘ పోరాటాల ద్వారా సర్వాయి పాపన్న గుట్ట శ్రేణిని గ్రానైట్ క్వారీల బారిన నుండి కాపాడామని తెలిపారు. అనంతరం తాళ్లపల్లి సంధ్యను ఏకగ్రీవంగా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుదగోని రమ్యగౌడ్, బత్తిని సంధ్యగౌడ్, కేశబోని రామ గౌడ్, ఇదు మమత గౌడ్, ఆడెపు రజిత గౌడ్, చెప్యాల రజితగౌడ్, కలర్ సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి’

కరీంనగర్ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నగర పాలక సంస్థకు నిధులు విడుదల చేస్తే పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజల సమస్యలు దూరం చేస్తామని మేయర్ సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 24వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కుర్ర తిరుపతితో కలిసి మేయర్ 1.86 కోట్ల రూపాయల నిధులతో పలు చోట్ల సీసీ రోడ్లు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైన్, మంచినీటి పైపులైన్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 24వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ముఖ్యంగా 20 ఏళ్ల కింద నిర్మాణం చేసిన డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయని, అందుకే నూతన డ్రైనేజీ నిర్మించ నున్నట్లు తెలిపారు. మున్సిపల్ నిధులతో దశల వారీగా నగర వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. సంవత్సర కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, మంత్రులు చొరవ తీసుకొని నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు. గతంలో సీఎం అస్యూరెన్స్ కింద సాంక్షన్ చేసిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి నేరుగా నగరపాలక సంస్థకు విడుదల చేస్తే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

డివిజన్‌లో చాలా అభివృద్ధి పనులు వివిధ కారణాలతో పెండింగ్‌లో పడిపోయాయన్నారు. గతంలోనే డివిజన్ అభివృద్ధి కోసం 2 కోట్ల 26 లక్షల పనులకు టెండర్లు పిలిచి, ప్రస్తుతం 1.86 లక్షల పనులు ప్రారంభించామని తెలిపారు. మిగతా నిధుల పనులు కూడా త్వరలోనే ప్రారంభం చేస్తామన్నారు. దశల వారీగా నిధుల లభ్యత ప్రకారం అభివృద్ధి పనులు చేసి నగర రూపురేఖలు మార్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, ఎడ్ల సరిత అశోక్, డీఈ అయూబ్‌ఖాన్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, మేయర్

గ్రామాల్లో కోతుల బీభత్సం

-బెంబేలెత్తుతున్న ప్రజలు -పట్టించుకోని అధికారులు



దుర్శేడ్ గ్రామంలో ఇళ్లపైకి ఎక్కిన కోతులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో కోతుల బెడదతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. పలు గ్రామాల్లో కోతులు సమూహంగా తిరగ డంతో గ్రామస్థులు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. దుర్శేడ్, ఇరుకుల్ల, చామనపల్లి, మొగ్దుంపూర్, జూబ్లీనగర్, ఎలబోతారం, కొండాపూర్, గ్రామాల్లో వానరాలు గ్రామాల్లో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో వేసిన పంటను కూడా నాశనం చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపైన ఉన్న గూనపెంకులు చిందరవందర చేసి నాశనం చేస్తున్నాయి. అటుగా వెళ్తున్న వారిని గాయపరుస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

మండలంలో ఇటీవలి కాలంలో 36మందికి పైగా కోతుల దాడిలో గాయపడ్డారు. కొద్ది రోజుల కిందట మాజీ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్యను కూడా గాయపరిచాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని కోతుల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కరీంనగర్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్శేడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధ వారం మండల విద్యాధికారి కె రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని నిర్వాహకు లను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీ లించారు. మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా జరుగు తున్న పెయింటింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జానకీదేవితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జెడ్పి కార్వర్ట్‌లోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పస్వామి తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శనైశ్చర వ్రత సహిత మహా యాగం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ నెల 28న ఉదయం ఆలయంలో 10 గంటల నుంచి పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 8 గంటల నుంచి మహా పడిపూజ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ డి సంపత్, గడప నాగరాజు, బొల్లు నరేందర్, రుద్రాక్ష కృష్ణ, ఎన్నం ప్రకాశ్, మంగి రవి, పరశురాములు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుడికి నివాళి

భగత్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ మాజీ అధ్యక్షుడు మంచాల తిరుపతి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన తిరుపతి అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. తిరుపతి మృతదేహానికి బుధవారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బోయిని అశోక్, బత్తుల బాబు, కిన్నెరమల్లవ్వ, బూడిద సదాశివ, రవీందర్‌రెడ్డి, బొగం శంకర్, వొడ్నాల వెంకటేష్, రాజేశం, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకులకు సన్మానం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ నాయకులను బుధవారం గోపాల్‌రావుపేట మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న వెంకటరామిరెడ్డి, అబ్దుల్ రెహమాన్‌లు సన్మానించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సిరిపురం లావణ్య నాగప్రసాద్, అసెంబ్లీ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా నజీర్, మున్సిపల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా శరణ్యగౌడ్, కాసిఫ్, జాఫర్, రూరల్ మండల వైస్ ప్రెసిడెంట్ షానవాజ్, కొత్తపల్లి వైస్ ప్రెసిడెంట్‌గా బూస ప్రశాంతి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్జా, కార్యదర్శిగా షబాజులా ఖాన్, కాజా జాక్కోద్దీన్, ప్రధాన కార్యదర్శిఆ అజీజ్, కార్యదర్శి సద్దాంలను సన్మానించారు.

నిబంధనలు పాటించని పాఠశాలలు సీజ్ చేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను ఎంఈవో సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాము అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకుండా, ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, ఫెయ్యార్ సేఫ్టి లేకున్న నడుస్తున్నాయన్నారు.

క్రికెట్‌లో సెయింట్‌జార్జ్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న సెయింట్‌జార్జ్ ఛైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సెయింట్‌జార్జ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గోవాలో యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను, కోచ్ సాయినాథ్‌ను పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినందించారు.

పాస్టర్‌లకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుక సందర్భంగా స్థానిక ఫిలింభవన్‌లో బుధవారం క్రిస్టియన్ ఫోరమ్ ఫర్ ఫండమెంటల్ రైట్స్ సిఎస్ఐ- టిఏ బెనిఫిషరీ టేక్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్‌లకు సన్మానం, క్రిస్టియన్ ఫైనాన్సియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల కరపత్రావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డీఓ కుందారపు మహేశ్వర్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, వర్ణాలకతీతంగా గురువులు సమాజం పట్ల బాధ్యత కలిగి ప్రగతి పథంలో నడిపించాలని అన్నారు. ప్రపంచ శాంతి కోసం క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ దయాకర్, నిర్వాహకులు గుండ్ర కృపాదానం, పి జ్ఞానప్రకాశం, ఆర్ బెంజిమన్, క్రిస్టఫర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడికి సన్మానం

సుభాష్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని టీఎన్జీవో నాయకులు సన్మానించారు. కరీంనగర్ జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటుకు కరీంనగర్ వచ్చిన విరాహత్‌అలీని జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, ఒంటెల రవీందర్‌రెడ్డి, సర్దార్ హర్మేందర్‌సింగ్, నాగరాజు, టిజీఓ నాయకులు కిరణ్, హస్సర్ శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

లెర్న్ ఇంగ్లీష్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లెర్న్ ఇంగ్లీష్ పేరుతో డిగ్రీ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వివేకానంద డిగ్రీ, పీజీ కాలేజీ సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడు, హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తయారు చేసిన పుస్తకాన్ని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ లెర్న్ ఇంగ్లీష్ బుక్‌ను రూపొందించి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థులకు సులభంగా అందరికీ అర్థమయ్యే విధంగా దీనిని రూపొందించారని సాగర్‌ను అభినందించారు. ధనపురి సాగర్ మాట్లాడుతూ ఈ కాపీలన్నీ ఉచితంగా ప్రతి ఒక్క విద్యార్థికి అందే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇంగ్లీష్ నేర్చుకునేలా చేయడమే తన ప్రయత్నమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్, డాక్టర్ అలీఖాన్ పాల్గొన్నారు.

‘బొమ్మ వెంకన్న సేవలు మరువలేనివి’



బొమ్మ వెంకన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

కరీంనగర్ టౌన్/రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్ సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. బుధవారం బొమ్మ వెంకటేశ్వర్ జయంతి సందర్భంగా బొమ్మకల్‌లోని మున్నూరుకాపు వసతి గృహంలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్ల హరిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరుకాపులను ఒకతాటిపైకి తీసుకు వచ్చిన ఘనత బొమ్మ వెంకన్నదని, మున్నూరుకాపుల అందరూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు బొమ్మ వెంకన్న సేవలు మరువరానివని కొనియాడారు. ఆయన ఆశయాలు కొనసాగిం చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి వసతిగృహం ట్రస్టు ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బొమ్మ రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్య క్షులు ముప్పిడి సునీల్, సమన్వయకర్త సత్తినేని శ్రీనివాస్, నాయకులు కర్ర సూర్యశేఖర్, కళ్యా డపు ఆగయ్య, ముప్పిడి బాలకృష్ణ, మునిపల్లి ఫణిత, రాజ్‌కుమార్, దీపక్ ప్రశాంత్, కోల సంపత్ రెడ్డి, బొల్లం లింగమూర్తి, పసుల మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య

వీణవంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య అన్నారు. మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు యాంటి డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలబారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

భగవద్గీత పాఠకుడికి బీజేపీ ఆధ్వర్యంలో సన్మానం

శంకరపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గీతా ప్రచారకుడు, గీతా పఠనదారి 18 పర్వాలు అనునిత్యం పఠిస్తూ గ్రామంలో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు కృషి చేస్తున్న భూపతి శంకర్‌లింగంను బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, నాయకులు సారయ్య, శ్రీనివాస్, జయప్రకాష్, శ్రీనివాస్, నాగభూషణం, భూపతి, పార్థసారథి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన

హుజూరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట విశ్వప్రగతి హైస్కూల్ విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు బుధవారం ఆందోళన చేపట్టారు. అకాడమిక్ ఇయర్ మధ్యలో పాఠశాలను ఎలా ఆపుతారని ఎంఈవోను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు విశ్వప్రగతి హైస్కూల్‌ను సీజ్ చేశామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వివిధ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నికలు



నియామక పత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలోబూత్ అధ్యక్షుల ఎన్నికలు బుధవారం జరిగాయి. 24వ బూత్ అధ్యక్షుడిగా గరిగె శివకృష్ణ, 25వ బూత్ అధ్యక్షుడిగా ఛత్రసింగ్, 52వ బూత్ అధ్యక్షుడిగా నీలం రవీందర్‌ను ఎన్నికలాధికారి దండు కొంరయ్య పర్యవేక్షణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన బూత్ అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తూర్పాటి రాజు, నరాల రాజశేఖర్, తూముల శ్రీనివాస్, అంకటి వాసు, గంట సంపత్, పంజాల సుధాకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూరు జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు కొనసాగాయి. బాలురకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి జిల్లాస్థాయికి ఎంపిక చేశామని మండల విద్యాధికారి రవీందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు, పీడీలు సౌజన్య, శ్రీనివాస్, సంతోష్, రాజు, డానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మండల స్థాయి సీఎం కప్ పోటీలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా బాల బాలికలకు ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీలు రేణుక, సత్యానంద్, భాగ్యలక్ష్మి, అనిల్‌కుమార్, సంధ్య, నరేషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సొల్లు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర మండలంలో సీఎం కప్ క్రీడలు కొనసాగుతున్నాయి. రెండోరోజు బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. గెలుపొందిన జట్లకు ఎస్ఐ నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ బాబు శ్రీనివాస్, ఆయాపాఠశాలల పీఈటీలు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండిలో ముగిసిన క్రీడలు..

చొప్పదండి: చొప్పదండి మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడు తూ ప్రపంచంలో ఉన్నతస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామీణ స్థాయి నుంచి ఆటల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. క్రీడలు విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని అన్నారు. శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని వివరించారు. అనంతరం గెలుపొందిన జట్లకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె మహేశ్, సభ్యులు మానస గంగయ్య, అశోక్, మండలాభివృద్ధి అధికారి ఆర్ వేణుగోపాల్‌రావు, మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షిత్, ఎస్ఐ అనూష, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పద్మాకర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





చొప్పదండిలో క్రీడాకారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నగునూర్‌లో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

గంగాధర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని సురభీ పాఠశాల విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభను చాటారు. డిల్లీకి చెందిన రంగోత్సవ సంస్థ అక్టోబరులో మండలంలో విద్యార్థులకు డ్రాయింగ్ కలరింగ్ పోటీలను నిర్వహించారు. సురభీ పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. బుధవారం సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందించినట్లు కరస్పాండెంట్ వీరేశం తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీర నర్సయ్య, సంస్థ ప్రతినిధి రామానుజం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-4 విజేతకు సన్మానం

రామడుగు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన చాట్ల భువన ఇటీవల ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో కమర్షియల్ టాక్స్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. కాగా బుధవారం సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ శాలువాతో సత్కారించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయుడు చాట్ల ఆనందం, స్కూల్ కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం రిలే నిరాహార దీక్ష

శంకరపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు ఇవ్వాలని అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడు మోరె గణేష్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మోరె గణేష్ మాట్లాడుతూ మొలంగూర్ గ్రామంలోని సర్వే నంబరు 703, 378లో గతంలో మొలంగూర్ గ్రామంలోని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసుకున్నార న్నారు. ఇంకా మిగిలి ఉన్న ప్రభుత్వ భూమి అక్రమణకు గురవుతోందన్నారు. ఈ స్థలాన్ని అధికారులు విచారణ చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సాయంత్రం రిలే నిరాహార దీక్ష చేపట్టిన వారికి న్యాయవాది, జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, మాజీ వైస్‌ఎంపీపీ పులికోట రమేష్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు సతీష్, మాజీ సర్పంచ్‌లు దాసరపు భద్రయ్య, రాజయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు మోరె శ్రీనివాస్, బొజ్జ రవి, మెరుగు శ్రీనివాస్, చల్లూరి రాజేందర్, కనకం సాగర్ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రత చట్టం తీసుకురావాలి

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

తిమ్మాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మీడియాపై జరుగుతున్న దాడుల్ని నియంత్రించాలని, జర్నలిస్టుల భద్రతా చట్టం తీసుకురావాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ డిమాండ్ చేశారు. హైదారాబాద్‌లో జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు దాడి చేయడానికి నిరసనగా తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీ వద్ద రాజీవ్ రహదారిపై కరీంనగర్ జిల్లా జర్నలిస్టులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ నిరసనలో విరాహత్ అలీ పాల్గొని మాట్లాడారు. మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబుకు తెలంగాణ ప్రాంతంలో ఉండే అర్హత లేదన్నారు. కుటుంబ కలహాలను మనసులో పెట్టుకొని విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై మోహన్ బాబు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. తూతూ మంత్రంగా మోహన్‌బాబుపై కేసులు పెడితే సరిపోదని మోహన్‌బాబుపై హత్యయాత్నం కేసుతో పాటు రౌడీషీట్ తెరవాలని డిమాండ్ చేశారు. మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జర్నలిస్టులతో కలిసి డీజీపీ కార్యాలయం ఎదుట బైఠయించి నిరసన తెలుపుతామని విరహత్ అలీ హెచ్చరించారు. జర్నలిస్టుల నిరసన సందర్భంగా కరీంనగర్-హైదారాబాద్ వైపు వెళ్లే ఇరుపక్కల ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎల్‌ఎండీ పోలీసులు వచ్చి ధర్నాను విరమింపచేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో జాతీయనాయకుడు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, యూనియన్ నాయకులు గాండ్ల శ్రీనివాస్, ఈద మధుకర్‌రెడ్డి, ఎలగందల రవీందర్, ఇతర రాష్ట్ర, జిల్లా మండల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



రాజీవ్ రహదారిపై బైఠాయించిన జర్నలిస్టులు